

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

నిజామాబాద్ అర్బన్, జనవరి 20: జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జిల్లాలోని 13 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, మొత్తం 2,563 మంది విద్యార్థులకు గాను 1,697 మంది హాజరు కాగా, 866 మంది గైర్హాజరైనట్లు డీఈవో వెల్లడించారు.





ఎస్సారెస్పీ పరిధిలో.. భారీగా వరి సాగు !

- ఎల్ఎండీ ఎగువన ఈ యాసంగిలో 9లక్షల ఎకరాలకు నీరు
- ఆరుతడికి అవకాశం ఉన్నా.. వేయని రైతులు
- వరి సాగుకే మొగ్గు చూపిన ఆయకట్టు రైతులు
- నెల రోజుల్లో 20 టీఎంసీల నీటి వినియోగం
- తగ్గిపోతున్న నీటి నిల్వలు
- తాగునీటి అవసరాలకు నిల్వను ఉంచేందుకు నిర్ణయం

నిజామాబాద్, జనవరి20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు భారీగా పెరిగింది. ఈ యాసంగిలో రైతులు భారీగా పంటలను సాగుచేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేస్తుండటంతో ఎల్ఎండీ ఎగువన మొత్తం ఆయకట్టుకు నీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో 9లక్షల ఎకరాలకు సాగు నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ ఆయకట్టు కింద నాల్గున్నర లక్షల ఎకరాల సాగు అవుతుండగా లక్ష్మీ, సరస్వతీ కాల్వల కింద సాగు కొనసాగుతోంది. వీటితోపాటు గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలతోపాటు ఇతర ఎత్తిపోతల పథకాల నుంచి సాగునీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 9లక్షల ఎకరాల్లో ఈ యాసంగిలో సాగైంది. ప్రాజెక్టు కింద ఆయకట్టుకు నెల రోజుల్లోనే 20 టీఎంసీల నీటిని వినియోగించడంతో గణనీయంగా నీటిమట్టాలు తగ్గిపోతున్నాయి.

● నెల రోజుల్లో 20 టీఎంసీల నీటి వినియోగం

ఎస్సారెస్పీ పరిధిలో ఈ యాసంగిలో ఎక్కువ మొత్తంలో పంటలను సాగు చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటినిల్వలు ఎక్కువగా ఉండటంతో శివం కమిటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎల్ఎండీ ఎగువ ఉన్న మొత్తం ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు నిర్ణయించారు. గతనెల 18న యాసంగి సాగుకు కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. నీటి విడుదల సమయంలో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు (90 టీఎంసీ)లకు గానూ 1088.60 అడుగుల (78 టీఎంసీ) నీరు ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గతనెల 18న నుంచి నెలరోజుల్లో 20 టీఎంసీల వరకు నీటిని పంటలకు వినియోగించారు. ఈ ప్రాజెక్టు పరిధిలో కాకతీయ కాలువ కింద నాల్గున్నర లక్షల ఎకరాలు సాగవుతోంది. లక్ష్మీ, సరస్వతీ, కాలువలతో పాటు చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలతోపాటు ఇతర ఎత్తిపోతల పథకాల కింద మరో నాల్గున్నర లక్షల ఎకరాలు సాగుచేశారు. ఈ యాసంగిలో ఈ ప్రాజెక్టు పరిధిలో 9లక్షల ఎకరాలకు పైగా సాగుకావడంతో నీటి వినియోగం భారీగా పెరిగింది. ఆరుతడి పంటలు కొన్ని ప్రాంతాల్లో వేయాలని ఇరిగేషన్ అధికారులు సూచించిన రైతులు మాత్రం వరిసాగుకే మొగ్గుచూపారు. ఈ ప్రాజెక్టు పరిధిలో 9లక్షల ఎకరాల వరకు పంటల సాగు కాగా దీంట్లో 2లక్షల ఎకరాల వరకు జిల్లాకు చెందిన ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగడంతోపాటు ఆన్‌ఆఫ్ పద్ధతిలో నీళ్లు అందించడం వల్ల రైతులు కాలువల కింద ఎక్కువగా సాగుచేశారు. ప్రాజెక్టు నీళ్లు అందని సమయంలో కరెంటు అందుబాటులో ఉండటంతో బోర్లను వినియోగిస్తున్నారు. భూగర్భజలాలు నిండుగా ఉండటంతో రైతులు ఎక్కువగా వరి సాగు కొనసాగిస్తున్నారు.

● తగ్గిపోతున్న నీటి నిల్వలు


ప్రాజెక్టు నుంచి యాసంగి సాగుకు నీటి విడుదల చేసే సమయంలో 78 టీఎంసీల నీళ్లు ఉండగా నెలరోజుల్లో 20 టీఎంసీల నీళ్లు తగ్గిపోయాయి. ప్రాజెక్టులో ప్రస్తుతం 1082.10 అడుగుల నీళ్లు ఉండగా 58.36 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. గతేడాది ఇదే సమయానికి 68 టీఎంసీలకు పైగా నీళ్లు ఉన్నాయి. వరి నాట్ల కోసం రైతులు ఎక్కువ మొత్తంలో నీటి వినియోగం చేస్తుండటంతో కాల్వలకు నీటి విడుదల పెంచారు. వీటితోపాటు వరద కాలువలకు కూడా నీటి విడుదల చేస్తుండటంతో ఎక్కువ మొత్తంలో నీళ్లు వినియోగం అవుతున్నాయి. ప్రాజెక్టులో నీటి మట్టాలు త్వరగా తగ్గిపోతున్నాయి. ఈ యాసంగిలో వచ్చే మార్చి చివరివరకు పంటలకు నీటి విడుదల చేసేందుకు అధికారులు నిర్ణయించారు. సాగునీటితోపాటు తాగునీటికి కూడా నీటిని అందించాల్సి ఉండటంతో ఆన్ ఆఫ్ పద్ధతి ద్వారానే నీటి విడుదలను చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. వచ్చే జూలై వరకు వరదలు వచ్చే అవకాశం లేకపోవడంతో ప్రాజెక్టులో 20టీఎంసీల వరకు నీటినిల్వలు ఉంచేందుకు అధికారులు నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న 58 టీఎంసీలలో 38 టీఎంసీలు వ్యవసాయానికి అందించనున్నారు. అవసరమైతే మరో రెండు టీఎంసీల వరకు విడుదల చేసేందుకు అధికారులు నిర్ణయించారు. మిషన్ భగీరథ కింద నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, జ గిత్యాల జిల్లాలకు తాగునీటిని అందించా ల్సి ఉండటంతో నిల్వలను ఉంచేందుకు నిర్ణయం తీసుకున్నారు.

● ఆరుతడికి అవకాశం ఉన్నా వేయని రైతులు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం వరి సాగుకావడంతో అధికారులు కూడా ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆరుతడి పంటలు వేసేందుకు అవకాశం ఉన్నా రైతులు మొగ్గు చూపకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్నారు. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల పరిధిలో ఆయకట్టు ఉండటంతో పంటలసాగును బట్టి నీటి విడుదల చేయనున్నారు. ఈ జిల్లాల పరిధిలో యాసంగిలో మెట్టపంటలు వేసే అవకాశం ఉన్నా భూగర్భ జలాలు ఉండటం వ్యవసాయానికి కరెంటు కూడా సరఫరా అవుతుండటంతో రైతులు ఆరుతడి పంటలు వేయలేదు. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, జొన్న, వేరుశనగ, శనగ, ఇతర పంటలు వేసే అవకాశం ఉన్న రైతులు వరిసాగువేశారు. వరినాట్లు డిసెంబర్ నెలతోపాటు ఈనెల కూడా వేయడంతో నీటికి ఇబ్బంది వస్తోందని భావిస్తున్నారు. వరికి సరాసరి 80రోజులకు పైగా నీరు అవసరం ఉండటం, మార్చిలోనే ఎండలు పెరగడం వల్ల ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో వరి నాట్లు పూర్తికావడం వల్ల ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేసేందుకు ఏర్పాట్లుచేశారు. ప్రాజెక్టు పరిధిలో 9లక్షల ఎకరాల వరకు ఈయాసంగిలో పంటలు సాగయ్యా యని ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి తెలిపా రు. ఎల్ఎండీకి ఎగువ ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగిస్తున్నామని తెలిపారు. అవసరమైన మేరకు సాగునీరు విడుదల చేస్తామన్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు




ట్రావెల్ ఏజెంట్ల ఇళ్లల్లో.. సీఐడీ సోదాలు

- ఉలిక్కి పడుతున్న జిల్లాలోని ట్రావెల్ ఏజెంట్లు
- అదుపులో భీంగల్‌కు చెందిన ట్రావెల్ ఏజెంట్
- భయాందోళనలో గల్ఫ్ ఏజెంట్లు

భీమ్‌గల్ రూరల్, జనవరి 20: జగిత్యాల జిల్లా కోరుట్లలోని ముగ్గురు గల్ఫ్ ఏజెంట్ల ఇళ్లలో సీఐడీ అధికారులు సోదాలు చేశారు. కొన్ని పాస్‌పోర్టులు, నకిలీ ధ్రువపత్రాలు, స్టాంపులతోపాటు ఓ గల్ఫ్ ఏజెంట్ ఇంట్లో 2లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం తెల్లవారు జామున ఉదయం 4 గంటల ప్రాంతంలో భీమ్‌గల్ పట్టణకేంద్రానికి చెందిన పాస్‌పోర్ట్ ఏజెంట్ చెప్పాల సుభాష్‌ను తన ఇంటి వద్ద అదుపులోకి సీఐడీ పోలీసులు తీసుకున్నారు. సుమారు 3గంటల పాటు భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో విచారించినట్లు సమాచారం. భీమ్‌గల్‌కు చెందిన సుభాష్ జిల్లా కేంద్రంలో పాస్‌పోర్టు కార్యాలయం సమీపంలో ఆఫీస్‌ను ఏర్పరుచుకొని కొన్నేళ్లుగా కమీషన్ ఏజెంట్‌గా నిత్యవృత్తిగా కొనసాగిస్తున్నాడు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పాస్‌పోర్టులు చేస్తున్నారన్న సమాచారం మేరకు సుభాష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పాస్‌పోర్టు ఏజెంట్ సుభాష్‌ను సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సమాచారంతో భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని ట్రావెల్స్ షాప్ యజమానులు 2రోజుల నుంచి ట్రావెల్స్‌ను మూసివేశారు. పాస్‌పోర్ట్ ఏజెంట్ సుభాష్‌కు ట్రావెల్ ఏజెంట్ల మధ్య మంచి సత్సంబంధాలు ఉండడంతో ఏమైనా జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. భీమ్‌గల్ పట్టణకేంద్రానికి చెందిన ఓ ట్రావెల్ ఏజెంట్ యజమానికి, సుభాష్‌కు వ్యాపారంలో మంచి సంబంధాలు ఉన్నాయన్న గుసగుసలు ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. నకిలీ పాస్‌పోర్ట్‌ల వ్యవహారంలో పోలీసులు నిక్కచ్చిగా దర్యాప్తుచేస్తే మరికొంతమంది నకిలీ ఏజెంట్ల గుట్టు బయటపడుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

రేపటి నుంచి పెద్దగుట్ట ఉర్సు ఉత్సవాలు

- వేడుకల్లో పాల్గొననున్న మంత్రి జూపల్లి




వర్ని, జనవరి 20: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా విశ్వసించే పెద్దగుట్ట ఉర్సు ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతీ సంవత్సరం సాంప్రదాయ ప్రకారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఈ ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఉత్సవాలలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతులు పాల్గొంటారని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఖాజా మోహినొద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జోహార్ నమాజ్ తర్వాత ఒంటె, గుర్రం తోడుతో జలాల్‌పూర్ గ్రామం నుంచి గందల్‌ను ఊరేగింపుగా ముఖ్య అతిథులచే ఖవ్వాలి కార్యక్రమంతో ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొంటారని తెలిపారు. మంగళవారం దీపారాధన, బుధవారం తిలవతే ఖురాన్ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం భోజనవసతి, మరుగుదొడ్లు, స్నాన ఘట్టాలు, వైద్య సదుపాయాలు కల్పించినట్లు నిర్వాహకులు జమాల్, ఉర్సు ఇన్‌చార్జీ మన్సూర్‌సాబ్, అసదుల్లాఖాన్ తెలిపారు.

ఓటరు తుది జాబితాలో పొరపాట్లు ఉండొద్దు

- ఆదివారం సైతం ఓటరు నమోదును కొనసాగించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

డిచ్‌పల్లి, జనవరి 20: ఓటరు తుది జాబితాలో ఎలాంటి పొరపాట్లూ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. మరణించిన ఓటర్ వివరాలను ఓటర్ జాబితా నుంచి తొలగించాలని, అందుకు సన్నద్ధంగా పూర్తివివరాలు తెలుసుకున్న తర్వాతే ఆ నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన డిచ్‌పల్లి మండలంలోని బీబీపూర్, ఖిల్లా డిచ్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఓటరు నమోదు కేంద్రాలను కలెక్టర్ తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటుహక్కు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని, ఈ అవకాశం యువఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు సందర్భంగా ఎంతమంది కొత్తఓటర్లు పేర్లు నమోదు చేసుకున్నారు. అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులు ఏ ఒక్కటి తప్పిపోకుండా వెంట వెంటను ఆన్‌లైన్ చేసుకోవలన్నారు. ఓటరు నమోదు పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండరాదని, ఓటరు నమోదు పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాని ఆదేశించారు. ఆదివారం సైతం ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు ఆదేశించారు. ఓటరు నమోదు పట్ల యువత నిర్లక్ష్యం వీడాలని సూచించారు. ఓటరు తుది జాబితాలో ఎలాంటి పొరపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజేందర్, బూత్ లెవల్ సూపర్‌వైజర్లు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.




బీబీపూర్‌లో వివరాలుఅడిగి తెలుసుకుంటున్న కలెక్టర్



నామినేటెడ్ పదవులపై సీనియర్ల ఆశలు

- ఇప్పటికే జిల్లాకు ఎమ్మెల్సీ పదవి
- కార్పొరేషన్ పదవులపై పలువురు సీనియర్ నాయకుల ఆశలు
- పైస్థాయిలో ప్రయత్నాలు
- మొదటి విడతలోనే తెచ్చుకునేందుకు లాబీయింగ్



నిజామాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని కాంగ్రెస్ నేతలు నామినేటెడ్ పదవులపై దృష్టిపెట్టారు. ఇప్పటికే ఎమ్మెల్సీగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు అవకాశం ఇవ్వడంతో మిగతా సీనియర్ నేతలు కార్పొరేషన్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉంటూ ప్రయత్నాలు చేస్తున్నారు. పదేళ్లలో పార్టీకి చేసిన సేవలతో పాటు తాము ఏ విధంగా అవకాశాలను వదులుకున్నారో నేతలకు వివరిస్తున్నారు. మొదటి విడతల్లోనే పదవులను తెచ్చుకునేందుకు లాబీయింగ్ కొనసాగిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి రాగానే పదవులను భర్తీ చేయనుండటంతో రాష్ట్ర నేతలతో పాటు ఏఐసీసీ నేతలను కలుస్తూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

● నామినేటెడ్ పదవులపై ఆశలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లా నుంచి ఎమ్మెల్సీగా సీనియర్ నేత పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌కు అవకాశమిచ్చారు. ఆయన నామినేషన్‌ను సైతం దాఖలు చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఖాళీలు లేవు. మరో రెండేళ్లవరకు వచ్చే అవకాశం కూడా లేదు. జిల్లాకు ఒక ఎమ్మెల్సీ ఇవ్వడంతో ఐదేళ్లలో మళ్లీ ఇచ్చే పరిస్థితి లేదు. కార్పొరేషన్‌కు సంబంధించిన నామినేటెడ్ పదవులకు అవకాశం ఉండటంతో జిల్లాకు చెందిన సీనియర్ నేతలు దృష్టి పెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి రాగానే కార్పొరేషన్ పదవులను భర్తీ చేయనుండటంతో నేతలంతా గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవులు వంద వరకు ఖాళీలు ఉండటం వాటిలో ముఖ్యమైన కార్పొరేషన్లు ఉండటంతో ఎక్కువమంది ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

● సీనియర్ నేతల ప్రయత్నాలు

జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలతో పాటు పార్టీకి సేవలు అందించిన సీనియర్ నేతలు అంతా ఈ నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పార్టీకి సంబంధించిన రాష్ట్రస్థాయి నేతలతోపాటు ఏఐసీసీ నేతలు, రాష్ట్ర ఇన్‌చార్జీలను కలుస్తూ తమకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవులు ఎక్కువగా ఉండటంతో జిల్లాకు చెందిన ఇద్దరు లేదా ముగ్గురికి మొదటి విడతలో అవకాశం రా నుండటంతో వారు ఎక్కువగా హైదరాబాద్‌లో ఉండి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. మొదటి విడతలోనే అవకాశం ఇస్తే ఎక్కువ రోజులు పదవుల్లో ఉండనుండటంతో ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడటం ఐదేళ్లపాటు అధికారంలో ఉండనుండటంతో ఎక్కువ మంది పదవులకు పోటీ పడుతున్నారు.

● ఢిల్లీ వరకు వెళ్లి ప్రయత్నాలు

పార్టీ అధికారంలో లేని పదేళ్లలో తాము ఏ విధంగా కష్టపడ్డామో వివరిస్తూ కొందరు నేతలు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. మొదటి విడతలో సీనియర్ నేతలకు, పార్టీ కోసం కష్టపడ్డ వారికే అవకాశం రానుండటంతో ఈ ప్రయత్నాలను చేస్తున్నారు. కొంతమంది నేతలు ఢిల్లీ వరకు వెళ్లి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెలా ఖరులోపు కొన్ని పదవులు భర్తీ అయ్యే అవకాశం ఉండటంతో పోటీ ఎక్కువగా ఉందని ఆ పార్టీకి చెందిన నేతలు తెలిపారు. వివిధ రంగాల్లో రాష్ట్రస్థాయిలో పనిచేసిన పార్టీ నేతలకు మొదటివిడతలో పదవులు వస్తాయని వారు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకునే నిర్ణయం ఆధారంగానే జిల్లాలోని నేతలకు పదవులు వచ్చే అవకాశం ఉంది. ఈ నామినేటెడ్ పదవులు ఎవరికి వస్తాయో ఈనెలాఖరులో తేలే అవకాశం ఉంది.

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత : సిరికొండ రేంజ్ అధికారి వినయ్

సిరికొండ జనవరి 20: పర్యావరణ పరిరక్షణ సమాజంలోని ప్రతీ పౌరుడి బాధ్యత అని సిరికొండ అటవీ శాఖ రేంజ్ అధికారి ఎం వినయ్‌నాయక్ అన్నారు. సిరికొండలో నేషనల్ గ్రీన్‌కోర్ యూనిట్ ఆద్వార్యంలో శనివారం జరిగిన పర్యావరణం, అడవుల పరిరక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన రేంజ్ అధికారి మాట్లాడారు. ఇందులో హెచ్‌ఎం నర్సయ్య, డీఆర్‌వో గంగారాం, అటవీ శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

ఏర్గట్ల, జనవరి 20: మండలంలోని బట్టాపూర్ తడపాకల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో ఓటరు నమోదును శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ చిత్రామిశ్రా పరిశీలించారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా అడిషనల్ కలెక్టర్ పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలతో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారికి ఫారం 6 కొత్త ఓటరు కార్డు దరఖాస్తులు స్వీకరించాలని, అలాగే మార్పుల కోసం ఫారం 8, ఫారం 7 జాబితాను ఆయా గ్రామ పంచాయతీల ద్వారా వివరాలు సేకరించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్, ఆర్ఐ సదానంద్‌లు పాల్గొన్నారు.

ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి

● కొలిప్యాక్‌లో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, జనవరి20: ప్రజలు ఆయురారోగ్యాలతో ఆనందంగా సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు కురిసి పంటలు పండాలని దేవుడిని వేడుకున్నట్లు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొలిప్యాక్ గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భూపతిరెడ్డి ఆయన సతీమణి వినోదిని ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే దంపతులు యజ్ఞం చేశారు. ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఈ ఆలయంలో పూజలు చేసి అసెంబ్లీ ఎన్నికల్లో తాను గెలువాలని మొక్కుకున్నాని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, అర్గుల్ ఉపసర్పంచ్ గోర్త రాజేందర్, ఎంపీటీసీ అనిత, కొలిప్యాక్ సింగిల్‌విండో మాజీ చైర్మన్ మాధురి బాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దుల భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఫిర్యాదు



డీఐఈఓకి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 20 : నగరంలోని ముబారక్‌నగర్‌లో, వినాయక్‌నగర్‌లో కమర్షియల్ భవనాల్లో ఏర్పాటు చేస్తున్న ఆల్ఫోర్స్ కళాశాలకు అనుమతులు లేవని, అనుమతులు వచ్చాయంటూ అడ్మిషన్లు తీసుకుంటున్న సదరు విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని శనివారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, టీవీయూవీ, పీడీఎస్‌యు, జీవీఎస్, టీఎస్ఎఫ్ విద్యార్థి సంస్థలు డీఐఈవో రఘురాజ్‌కు ఫిర్యాదు చేశారు. కమర్షియల్ భవనాల్లో కళాశాలలు ఏర్పాటు చేయవద్దని నిబంధనలు ఉన్నా.. సదరు కళాశాల ఇతర జిల్లాలలో వచ్చిన ర్యాంకులను ఇక్కడ చూపిస్తూ పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెట్టి ప్రచారాలను నిర్వహిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్‌సింగ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. అబద్ధపు ప్రచారాలు చేసి విద్యార్థులను మోసం చేస్తున్న సదరు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి గణేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, జైత్రాం రాథోడ్, మహేష్‌రెడ్డి, మహేష్‌సందీప్, తదితరులు పాల్గొన్నారు.

● ఆల్ఫోర్స్ కళాశాలకు అనుమతులు లేవు : డీఐఈవో రఘురాజ్

నగరంలో ఏర్పాటు చేస్తున్న ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఇంతవరకు అనుమతి ఇవ్వలేదని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. పలు విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు ఆయన స్పందించారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ బోర్డ్ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. కాబట్టి విద్యార్థులు, తల్లిదండ్రులు మోసపోవద్దన్నారు.

టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి

కోటగిరి,జనవరి20: మండలంలో టీబీ లక్షణాలు కలిగి వారు ఎవరైనా ఉంటే తక్షణమే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో శనివారం టీబీ వ్యాధి నిర్ధారణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీవో మారుతి, సర్పంచ్ విజయ, నాయకులు సాయన్న, పంచాయతీ కార్యదర్శి సునంద, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్

బీర్కూర్, జనవరి 20: బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకన్న తెలిపారు. ఈ టాలెంట్ టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. బీర్కూర్ జెడ్‌పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన టెన్త్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థి విఘ్నేష్‌కుమార్, మౌసీనా, శ్రీనిజ, దామరంచ, జడ్పీహెచ్ఎస్‌కు చెందిన అమృత, అక్షిత, గాయత్రి, ఎంజేపీకి చెందిన పవన్, సిద్దార్థ్, కిషోర్‌లు బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డు ప్రతీ ఒక్కరు తీసుకోవాలి

కోటగిరి,జనవరి20: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డులను ప్రతీ ఒక్కరు తీసుకోవాలని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి సూచించారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ, యాద్గార్‌పూర్ గ్రామాలలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. నిరంతరం యోగా, శారీరక శ్రమ, వాకింగ్ చేయడం వల్ల వ్యాధులు అదుపులో ఉంటాయని ఆరోగ్య అధికారి సూచించారు. ప్రతీ ఒక్కరు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మారుతి, ఏపీవో గంగారాం, ఎంఎల్ హెచ్‌పీ హిమాంజలి, సూపర్‌వైజర్ జ్యోతి,బ్యాంక్ మేనేజర్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఉమాకాంత్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కామారెడ్డిటౌన్,జనవరి 20:కామారెడ్డి పట్టణంలోని గోసంగి కాలనీకి చెందిన అంగ్రాసి అనిత కనిపించకుండా పోయినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డితెలిపారు. ఈ నెల 19న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయిందని ఆమె తల్లిదండ్రులు చుట్టు పక్కల, తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించలేదని అన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. అనిత ఆచూకీ తెలిసినచో కామారెడ్డి పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట,జనవరి20: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ప్రారంభమైందని ఫిబ్రవరి 22వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే 7,8,9,10వ తరగతిలలో ఖాళీగా ఉన్న సీట్లకు సైతం ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆటల పోటీలు ఆరోగ్యానికి ఎంతో మేలు

● జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

నిజామాబాద్ లీగల్, జనవరి 20: నిత్యం బిజీగా ఉండే జీవన విధానంలో ఆటల పోటీలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం ఆరోగ్యానికి కూడా వ్యాయామం చేసినట్లు ఉంటుందని జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా న్యాయవాదులందరూ పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచ్ ఆడారు. జిల్లా న్యాయాధికారి ఆటల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆటల పోటీలో క్రికెట్, క్యారమ్, షటిల్, చెస్, మొదలైన ఆటల పోటీలు మానసిక ఉత్తేజాన్ని నింపుతాయని తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాస్ చందక్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రెటరీ సత్యనారాయణ, బిట్ల రవి, సెక్రెటరీ బాగిచరణ్ మాట్లాడుతూ జనవరి 26ను పురస్కరించుకొని క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో క్యారమ్, చెస్, టెన్నీస్, క్రికెట్‌లో 200 మందికిపైగా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీకాంత్‌బాబు, జూనియర్ సివిల్ న్యాయాధికారి గోపికృష్ణ, కుష్బూ ఉపాధ్యాయ, సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, శ్రీహరి ఆచార్య, బిల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ ఉచిత కోర్సులకు దరఖాస్తుల తేదీ పొడగింపు

నిజామాబాద్ అర్బన్, జనవరి 20: గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ కోర్సులకు ఉచిత కోచింగ్ తరగతులు ఫిబ్రవరి 1 నుంచి నిజామాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రారంభమవుతాయని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు గతంలో గడువును ఈనెల 24 వరకు పొడగించినట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీఎస్‌బీసీస్టడీసర్కిల్.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5లక్షలలోపు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని నిబంధనల ప్రకారం మెటీరియల్ అందిస్తామన్నారు. ఇతర వివరాలకు 08462-241055 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మిట్టపల్లి క్రీడాకారిణి



క్రీడాకారిణి శ్రీతికను అభినందిసున్న పాఠశాల హెచ్‌ఎం సుశీల్ కుమార్

డిచ్‌పల్లి, జనవరి 20: ఆర్మూర్‌లో పట్టణంలో ఈ నెల 16నుంచి 18వరకు జరిగిన 67వస్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అండర్-14 పోటీల్లో జిల్లా బాలుర జట్టు మనితేజా క్యాంస పతకం అందుకోగా బాలికల విభాగంలో మెండే శ్రీతిక జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి గోల్డ్ మెడల్ అందుకొని ఫిబ్రవరి 3నుంచి 6వరకు ఛత్తీస్‌గఢ్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్ వ్యాయమా ఉపాధ్యాయుడు మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో రాష్ట్ర జట్టును ప్రథమ స్థాయిలో ఉండేలా కృషి చేయలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, రాఘవేందర్, బాలరాజు, పోశెట్టి, నిరంజన్, అభినందించారు.

రేపు మాంసం, చికెన్ దుకాణాలను మూసి ఉంచాలి: వీహెచ్‌పీ

నవీపేట,జనవరి20: మండల కేంద్రంలో ఈ నెల 22న మాంసం, చికెన్ దుకాణాలను మూసి ఉంచే విధంగా చూడాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు నవీపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. అయోధ్యలోని రామ మందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా మాంసం, చికెన్ దుకాణాలను మూసి ఉంచాలని కోరారు. అలాగే ప్రైవేటు పాఠశాలలను మూసి ఉంచాలని పాఠశాలల యాజమాన్యాలు, దుకాణాలను మధ్యాహ్నం 2గంటల వరకు మూసి ఉంచాలని వర్తక సంఘం సభ్యులకు కూడా తమ వినతిపత్రం అందజేశారు.

అక్రమ మద్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు

● 23న ఐదు ద్విచక్ర వాహనాల వేలం పాట

బోధన్ రూరల్, జనవరి 20: దేశీదారు, మత్తు పదార్థాలను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 23వ తేది మంగళవారం ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో ఐదు ద్విచక్ర వాహనాల వేలం పాట నిర్వహించబడుతుందన్నారు. అక్రమ మద్యం తరలిస్తుండగా ఈ వాహనాలను పట్టుకున్నామని, శిథిలావస్థకు చేరడంతో వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు 23వ తేది 10 గంటల లోపు బోధన్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● ఆర్మూర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి నజీమసుల్తానా



మాట్లాడుతున్న ఆర్మూర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి నజీమసుల్తానా

జక్రాన్‌పల్లి, జనవరి20:చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండా లని ఆర్మూర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి నజీమసుల్తానా అన్నారు. శనివారం జక్రాన్‌పల్లిలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్యసదస్సు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్మూర్ సీనియర్ సివిల్ న్యాయాధికారి నజీమసుల్తాన మాట్లాడుతూ చట్టాలపై ప్రజలు కట్టుబడి ఉండాలని, చట్టాలకు అనుగుణంగా నడు చుకోవాలన్నారు. గ్రామాలలో వీడీసీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇష్టమొచ్చినట్టు ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు.చట్టం ఎవరికి చుట్టం కాదని, చట్టం ముందర అందరు సమానమేనన్నారు. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకొని తప్పుచేసిన వారికి చర్యలు తప్పవన్నారు. దేశంలో చట్టమే గొప్పదన్నారు. ఏమైనా భూసమస్యలు ఉంటే ఇతర సమస్యలు సివిల్‌కోర్టు, పోలీస్‌శాఖ,రెవెన్యూశాఖ అధికారులు వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. చట్టాల గురించి తెలుసుకొని ప్రతీఒక్కరు చట్టాన్ని గౌరవిస్తూ నడుచుకోవాలన్నారు.గ్రామాల్లో వీడీసీలు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం అడిషనల్ డీసీపీ జయరాం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను తయారు చేస్తోందని చట్టాలను అతిక్రమించిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. యువతులను, విద్యార్థినులను, మహిళలను వేధిస్తే ఫోక్స్ చట్టం కింద చట్టరీత్యా చర్యలు తపవన్నారు.మహిళలను పురుషులతో సమానంగా వ్యవహరిస్తే సమాజం బాగుపడుతుందన్నారు. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోవద్దని, గ్రామాల్లో వీడీసీలు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని, చట్టాన్ని తీసుకొని ఇష్టమొచ్చినట్టు ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. చట్టాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, ఏసీపీ విజయసారథి, ఎస్సై సిహెచ్.తిరుపతి, ఎంపీపీ కుంచాల విమల రాజు, ఉపసర్పంచ్‌లు బాలకిషన్, గోర్త రాజేందర్, ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మరియా సతీష్, మండల కోఆప్షన్‌సభ్యుడు అక్బర్‌ఖాన్, తహసీల్దార్ ఎం.ఎ.ఖలీం, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, వివిధ గ్రామాల వీడీసీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన



పెర్కిట్‌లో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మోపాల్, జనవరి 20: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను మోపాల్ తహశీల్దార్ ఖాజా ఖుతుబుద్దీన్ శనివారం పరిశీలించారు. ఓటరు నమోదును సక్రమంగా నమోదు చేసే విధంగా అధికారులు చూడాలని కిందిస్థాయి అధికారులకు తహశీల్దార్ సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరు నమోదు చేసుకునే విధంగా గ్రామాల్లో యువతకు అవగాహన కల్పించే విధంగా చూడాలన్నారు. రెండు రోజుల పాటు ఈ ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మండలంలోని బోర్గాం(పి), మోపాల్, తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

మోస్రా: మండలంలోని 76 నుంచి 82వరకు గల పోలింగ్ కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను శనివారం తహసీల్దార్ శ్రీకాంత్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మరణించిన వారి ఓటు హక్కును తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ సాయిలు, బీఎల్‌వోలు కాశీరాం, రాము, సుజాత, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, కొటార్మూర్ గ్రామాలలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల కొటార్మూర్ ప్రాథమిక పాఠశాలలో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించింది. ఆదివారం రోజు కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, యువకులు ఓటరు నమోదు కేంద్రాన్ని సంప్రదించి తమ ఓటు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్న గంగామోహన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డొంకేశ్వర్: ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం ముగింపు ఉంటుందని డొంకేశ్వర్ తహసీల్దార్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 18ఏళ్లు నిండిన వారందరు ఓటరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మండలంలోని గ్రామపంచాయతీ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. కొత్త ఓటరు నమోదుతో పాటు ఓటర్ జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే ఫారం-6, ఫారం-8 ద్వారా సరి చేసుకుని వెఉలుబాటు కల్పించినట్లు ఆయన సూచించారు.

గణితం టాలెంట్ టెస్టులో విజేతలకు బహుమతుల ప్రదానం

కోటగిరి,జనవరి20: పోతంగల్ పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి గణితం టాలెంట్ టెస్టులను నిర్వహించారు. ఈ పోటీలలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సూదం వెంకటేష్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాయిలు, నోడల్ అధికారి లోల శంకర్, కారేగాం ప్రధానోపాధ్యాయులు దుర్గారావు, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, నాగనాథ్, ఉదయ్, వెంకటేశ్వర్ రెడ్డి, శివ కుమార్, శ్యామ్, హన్మాండ్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ముప్కాల్ విద్యార్థుల ఎంపిక

ముప్కాల్, జనవరి20: ముప్కాల్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆన్‌లైన్ విభాగంలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ముప్కాల్ విద్యార్థులు ప్రశాంత్, అభినవ్, ప్రణవ్, చైతన్యలు ఎంపికైన పాఠశాల హెచ్‌ఎం ఎం.గంగారాం తెలిపారు. ముప్కాల్ పాఠశాల విద్యార్థులు కాంపిటిషయన్ తికింగ్ అంశంలో మల్టిటాస్కింగ్ రోబోట్ అనే అంశంపై ఉత్తమ ప్రతిభ కనబరిచినందున రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని కోరారు. ఈ ప్రదర్శనకు సహకరించిన ఫిజికల్ సైన్స్ టీచర్‌లు కనకాద్రి, సురేష్‌కుమార్, నరేష్, బాలగంగాధర్‌లను, విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, నవీన్, అంజాద్, సునీత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మారం, అనంతగిరిలలో గ్రామసభలు

నవీపేట,జనవరి20: మండలంలోని ధర్మారం, అనంతగిరిలలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించి ఈ గ్రామసభలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. డ్రోన్ ద్వారా రసాయన ఎరువులు పిచికారి చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ధర్మారం సర్పంచ్ మాధవి, అనంతగిరి సర్పంచ్ రవీందర్ రెడ్డి, ఎంపీటీసీ సాయిలు, ఎంపీవో రామకృష్ణ, ఏపీఎం భూమేష్ గౌడ్, పంచాయతీ రాజ్ శ్రావణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము, మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముల విగ్రహ ప్రతిష్ఠాపన రోజు భక్తులు నిష్ఠగా ఉండాలి

బోధన్ రూరల్, జనవరి 20: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా హిందూ భక్తులందరూ నిష్ఠగా ఉండాలని వేద పండితులు ప్రవీణ్ మహారాజ్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మారుతి మందిరంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ సోమవారం రాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బోధన్‌లోని భక్తులు ఎలాంటి మాంసపు పదార్థాలు తినవద్దని, మత్తు పానియాలు తాగొద్దని, ధర్మ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు పాటు పాడాలని ఆయన అన్నారు. ఈ కార్య క్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, జనవరి 20: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ,పీజీ అడ్మిషన్ల గడువు ఈనెల 31వరకు పొడగించినట్లు అధ్యయన కేంద్ర రీజినల్ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో స్టడీ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ,పీజీద్వితీయ సంవత్సరానికి రినివల్ చేసుకునేందుకు ఈనెల 31చివరి తేదీ అని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమెతెలిపారు.

కలిగోట్‌లో పుట్ట శివాలయాన్ని శుద్ధి

జక్రాన్‌పల్లి, జనవరి20: మండలంలోని కలిగోట్ గ్రామంలో పుట్ట శివాలయాన్ని శనివారం సాయంత్రం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి, బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. ప్రధాని నరేంద్రమోదీ సంకల్పంతో అయోధ్య రామాలయ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయాల శుద్దిలో భాగంగా కలిగోట్ పుట్ట శివాలయంలో దినేష్‌కులచారి, బీజేపీ నాయకులు ఆలయం ఆవరణలో ఉన్న చెత్తను ఊడ్చారు. అనంతరం ఆలయం ఆవరణలో నీళ్లు పట్టి శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ భూమన్న, అసెంబ్లీ కన్వీనర్ పద్మరెడ్డి, తొర్లికొండ మాజీసర్పంచ్ ఈర్ల బాలయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామ మందిర నిర్మాణ వాల్ పోస్టర్ల కార్యక్రమం

పెర్కిట్, జనవరి20: ఆర్మూర్ పట్టణంలోని బీజేపీ క్యాంపు కార్యాలయం వద్ద శనివారం బీజేపీనాయకులు అయోధ్య రామమందిర నిర్మాణ కార్యక్రమం ఆల్ పోస్టర్‌లను అతికించారు. 500ఏళ్ల నుంచి నిరీక్షిస్తున్న రామ మందిర నిర్మాణ కార్యక్రమం జయప్రదామైన సందర్భంగా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జెస్సు అనిల్, పులి యుగంధర్, ఖాందేశ్ ప్రశాంత్, గుగులోత్ తిరుపతినాయక్, బాశెట్టి రాజ్‌కుమార్, తంగలపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా సమ్మేళనం

పెర్కిట్, జనవరి20: స్వామి వివేకానంద జయంతి ఉత్సావాలలో భాగంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్న క్రీడా సమ్మేళనంలో ఏబీవీపీ విభాగ్ సంఘటన నాయకులు రాజశేఖర్ పాల్గొని మాట్లా డుతూ చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంపొందించడానికి ఈ సమ్మేళనం ఎంతగానో దోహద పడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ కృష్ణ, సునిల్, సుహాస్‌రెడ్డి,బాలకృష్ణ, జెస్సు అనిల్, పాల్గొన్నారు.

టీయూ క్యాంపస్‌లో హాస్టల్ వసతి కల్పించాలి

● ఎన్ఎస్‌యూఐ డిమాండ్

డిచ్‌పల్లి,జనవరి 20: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సారంగ పూర్ బీఈడీ కళాశాల విద్యార్థులకు ప్రధాన క్యాంపస్ డిచ్‌పల్లి లో హాస్టల్ సౌకర్యం కల్పించాలని టీయూ రిజిస్ట్రార్ యాదగిరి కి ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో విద్యార్థులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగాఎన్ఎస్‌యూఐ కార్యదర్శి సాగర్ నాయక్ మాట్లాడుతూ.. వర్సిటీలో 4సంవత్సరాల నుంచి సారంగపూర్‌లోని బీఈడీ కళాశాల విద్యార్థులకు మెయిన్ క్యాంపస్‌లో హాస్టల్ కల్పిస్తున్నారని ఈ ఏడాది కూడా హాస్టల్ సౌకర్యం కల్పించలన్నారు. వర్సిటీలో చదివే విద్యార్థులు వివిధ జిల్లాల నుంచి వస్తారు కాబట్టి సెమిస్టర్, ఇంటర్నల్ ఎక్సామ్స్ సమయంలో హాస్టల్ సదూపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి రాజేందర్, పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పెద్దోళ్ల గంగారెడ్డి

పెర్కిట్,జనవరి20: భారతీయ జనతా పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పెద్దోళ్ల గంగారెడ్డి నియమితులయ్యారు.శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో బీజేపీ నాయకులు పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెద్దోళ్ల గంగారెడ్డి మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండి సంజయ్‌ఆశీస్సులతో రాష్ట్ర కిసాన్‌మోర్చ అధ్యక్షుడిగా ఎన్నికైనందున ప్రతీఒక్కరికి ధన్యావాదాలు తెలిపారు. రాబోయే కాలంలో కేంద్రంలో, రాష్ట్రంలో అమలవుతున్న రైతుల పాలసీలను రైతుల వద్దకు వారికి ప్రయోజనం చేకూరేలా ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెస్సు అనిల్, పొల్కం వేణు, ఆకుల రాజు, డమాంకర్ శ్రీనివాస్, వివిధ మోర్చల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా మృత దేహం లభ్యం

బోధన్ రూరల్/వర్ని, జనవరి 20 : రుద్రూరు మండలం అంబం గ్రామ శివారులోని నిజాంసాగర్ కెనాల్‌లో శనివారం మహిళ మృత దేహం లభించిందని రుద్రూరు ఏఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన విఠవ్వ (71) అనే మహిళ మనస్థాపానికి గురై ఈనెల 12వ తేదిన బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామ చెరువులో ఆత్మహత్య యత్నానికి పాల్పడిందన్నారు. శనివారం విఠవ్వ మృత దేహం అంబం శివారులో లభించిందన్నారు. మృతురాలి కుమారుడు గంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, జనవరి20: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకీని భక్తులు కొండపై చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. నూతనంగా నిర్మించినున్న వేంకటేశ్వర స్వామి నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తెలుగు విభాగాపు అధిపతిగా డా.లక్ష్మణ చక్రవర్తి

డిచ్‌పల్లి, జనవరి 20: తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి శనివారం తెలుగు విభాగాధిపతిగా డా.సీహెచ్ లక్ష్మణచక్రవర్తిని నియామిస్తూ ఉత్వర్వులు అందజేశారు. చక్రవర్తిని విభాగాధిపతిగా నియామించినందుకు వీసీ, రిజిస్ట్రార్‌లకు ధన్యవాదలు తెలిపారు. ఈ నియామకం పట్ల తెలుగు శాఖ అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

జైశ్రీరాం అక్షరూపంలో మిసిమి విద్యార్థులు

కమ్మర్‌పల్లి, జనవరి 20: మండల కేంద్రంలో 22న ఆయోధ్యలోని రామ మందిరంలో బాలరాముడి విగ్రప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగనున్న తరుణంలో శనివారం కమ్మర్‌పల్లి మండకేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాల విద్యార్థులు జైశ్రీరాం పేరును అక్షరూపంలో కూర్చి అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ బాలిరవీందర్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంగ్లీష్,హిందీ భాషల్లో జైశ్రీరాం నినాదాన్ని అక్షర రూపంలో చూపించారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేయిర్‌కు మంథని విద్యార్థిని

ఆర్మూర్‌రూరల్, జనవరి20: ఆర్మూర్ మండలం మంథని ఉన్నత పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు శ్యామలబాయి తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో మంథని విద్యార్థినిలు లాస్య, అంకిత, ఆరోగ్య విభాగంలో కూరగాయలు, పండ్ల, ఆవు పేడ బుడిద, ఆకులు, వేర్లు, చెక్క పొట్టు, బూడిదలను వాడి కూరగాయలు, పండ్లను 15రోజుల పాటు సహజ పద్దతులతో తాజాగా నిల్వ చేయవచ్చన్నారు. ఇదీ తక్కువ ఖర్చుతో ఇంట్లోనే అందరు తయారు చేసుకునే విధంగా రూపొందించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినిలను గైడ్ టీచర్ మల్లేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కోకిల నాగరాజు, విజయకుమారి, అభినందించారు.

నిశితలో ప్లేస్‌మెంట్

నిజామాబాద్ అర్బన్, జనవరి 20: నగరంలోని నిశిత డిగ్రీ కళాశాల (అటానమాస్)లో శనివారం పలు కంపెనీల ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. 24(7), ఏఐ కంపెనీలు నిర్వహించిన డ్రైవ్‌కు కళాశాల నుంచి సుమారు 50 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ నిఖిల్, కోఆర్డినేటర్ రాజులు తెలిపారు. కంపెనీలకు చెందిన ప్రతినిధులు నరేందర్‌గౌడ్, నవీన్, ప్రియాంక, హర్ష, నాందీ ఫౌండేషన్ నుంచి స్వాతి, ప్రవీణ్, టాస్క్ నుంచి రఘుతేజ, హన్మంతులు ఈ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఓఎం షేక్, ప్రిన్సిపల్ స్వప్న, వైస్ ప్రిన్సిపల్ రఘువీర్ అభినందించారు.

నేసనల్ మోటార్ సైకిల్ రేసింగ్‌లో జిల్లా వాసికి మూడో స్థానం



క్యాంతం మన్విత్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జనవరి 20:చెన్నైలో శుక్రవారం జరిగిన ఇండియన్ నేషనల్ మోటార్ సైకిల్ రేసింగ్‌లో జిల్లాకు చెందిన క్యాంతం మన్విత్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచాడు. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన రమణ రెడ్డి కుమారుడు మన్విత్‌రెడ్డి కుటుంబం బెంగుళూరులో స్థిరపడింది. మన్విత్‌రెడ్డి మోటార్ సైకిల్ రేసింగ్‌లో తన ప్రతిభను చాటుతూ ఆరు రౌండ్లలో జరిగిన ఫైనల్ పోటీలలో మూడో స్థానంలో నిలిచి సత్తా చాటాడు. ఈ సందర్భంగా మన్విత్‌రెడ్డిని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

గురుకుల అతిథి అధ్యాపకురాలి మృతి

ఆర్మూర్‌టౌన్, జనవరి20: పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకురాలు సీహెచ్.నిశిత అనారోగ్యంతో మృతి చెందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి తెలిపారు. కళాశాలలో కంప్యూ టర్ సైన్స్ బోధించేవారని గత కొంతకాలంగా క్యాన్సర్ సమస్యతో బాధ పడుతున్నాదని తన విధులను బోధనను చక్కగా బోధించే అధ్యాపకురాలు ఆకస్మాత్తుగా మృతి చెందడంతో విద్యార్థినిలు, తోటి అధ్యాపకులు కన్నీంటి పర్యాంతం అయ్యారు. ఆమె మృతి పట్ల కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు.

‘22న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలి ’

బోధన్ రూరల్, జనవరి 20: అయోధ్యలో 22న విగ్రహ ప్రతి ష్ఠాపన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని భారతీయ విద్యార్థి సేన జిల్లా కోకన్వీనర్ చింతాకుల లోకేష్ గౌడ్ ప్రభుత్వాన్నికోరా రు. దేశ ప్రజలు 500 సంవత్సరాల నుంచి అయోధ్య రామాలయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అత్యంత శుభ దినమైన డిసెంబర్ 22న రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రక టించాలని కోరారు. ఆయన వెంట బీవీఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

● బోధన్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తాం ● ఎంపీ ధర్మపురి అర్వింద్

బోధన్ రూరల్, జనవరి 20: బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో గ్రామీణ ప్రాంతాలలో చేసిన అభివృద్ధి శూన్యమని, కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్లు రాష్ట్ర అభివృద్ధికి కేటాయించినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కదోవ పట్టించిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బోధన్ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దాయన సుదర్శన్‌రెడ్డితో చర్చించి పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలను మోసం చేస్తూ కాలయాపన చేసిందని పేర్కొన్నారు. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో శనివారం కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు వికసిత్ భారత్ సంకల్ప యాత్రను రాజకీయం చేస్తే ఊరుకునేది లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కేంద్రంలో అధికారంలో బీజేపీ పార్టీని, ప్రధాని నరేంద్రమోదీని మరోసారి ఆశీర్వాదించి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ తన తీరును మార్చుకోవాలని, తన కొడుకు రోడ్డు ప్రమాదానికి కారకుడైతే తప్పించేందుకు ప్రయత్నించడం చాలా బాధాకరమన్నారు. నాకొడుకు ఇలా చేసి ఉంటే జైలుకు పంపించేవాడినని పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎంపీ అయిన నాటి నుంచి కృషి చేస్తూనే ఉన్నానన్నారు. పది సంవత్సరాలుగా గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, గ్రామ సమస్యలను తమ దృష్టికి తీసుకుస్తే అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. ప్రజల సమస్యలు చెప్పుకోడానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, తమది గడీల ప్రభుత్వం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీ కింద ఎరువులను, డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ, పంట పొలాల్లో పిచికారి చేయడానికి డ్రోన్‌లను డ్వాక్రా సంఘాల మహిళలకు అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. టీబీ రోగులకు ఉచిత మందులతో పాటు నెలకు రూ.500లను అందజేస్తుందన్నారు. పేదల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం ముందుంటుందన్నారు. వచ్చే నెల నుంచి పోషకాలతో కూడిన బియ్యాన్ని రేషన్ షాపుల్లో వచ్చే బియ్యంతో కలిపి అందజేస్తామన్నారు. రైతులు, పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం పలువురు యువకులు వివిధ పార్టీల నుంచి బీజేపీ పార్టీలో స్వచ్ఛందంగా చేరడంతో పార్టీ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ సిర్ప మంజుల సుదర్శన్, బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డి మోహన్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు పల్లె గంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర వికసిత్ భారత్ ఇంచార్జి ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీఈవో కమల్ వర్ధన్, బీజేపీ మండల అధ్యక్షులు మనోహర్, నరసింహారెడ్డి, సుధాకర్‌చారి, బోధన్ మండల అధ్యక్షులు మనోహర్, విఠల్‌గౌడ్, సాయిరెడ్డి, ప్రవీణ్, ఎంపీటీసీ అంజవ్వ తదితరులు పాల్గొన్నారు.



అమ్దాపూర్ గ్రామంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

టీయూలో క్రాస్ కంట్రీ జట్ల ఎంపికలు



టీయూ క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

డిచ్‌పల్లి,జనవరి 20: తెలంగాణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల, మహిళల క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్ 2024ను వర్సిటీ క్రీడామైదానంలో శనివారం నిర్వహించినట్లు డైరెక్టర్‌బాలకిషన్ తెలిపారు. ఈ ఛాంపియన్ షిప్‌కు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి వివిధ డిగ్రీ కళాశాలల అథ్లెట్స్ 40మంది పాల్గొన్నారు. ఆల్ ఇండియా ఇంటర్‌యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్ 2024 మహారాష్ట్రలోని నాందేడ్ శ్రీరామనంద తీర్థ మరఠ్వాడ యూనివర్సిటీలో ఫిబ్రవరి 10,11 తేదీల్లో నిర్వహిస్తారన్నారు.ఇందులో మొదటి ఆరుస్థానాలు అథ్లెటిక్స్‌తెలంగాణ యూనివర్సిటీ తరుపున పాల్గొంటారని తెలిపారు. టీయూ లో ఛాంపియన్ షిప్ ఎంపిక నిర్వహించడానికి అనుమతి ఇచ్చి క్రీడలు ప్రోత్సహిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరికి డైరెక్టర్ ధన్యవాదలు తెలిపారు.

● ఎంపికైన అథ్లెటిక్స్ పురుషుల జట్ల విభాగంలో..

అనిల్(టీటీడబ్ల్యూఆర్‌డీసీ)జానేశ్వర్(జీజీసీ)బందునాయక్ (జీజీసీ) నాగరాజు(టీటీడబ్ల్యూఆర్‌డీసీ)వెంకుల్(జీజీసీ)వినోద్(జీజీసీ) మహిళల విభాగంలో..హరిత(జీడీసీ)అంకిత(జీడీసీ)మౌనిక (జీజీసీ)వర(జీజీసీ)రోజా(టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ) దీక్ష(టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ)లు ఎంపికయ్యారని ఈ ఛాంపియన్ షిప్ కార్యనిర్వాహకులుగా డా.బీఆర్ నేతా కన్వీనర్‌గా బాలకిషన్, వ్యవహరించగా వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్స్‌గా బాలమణి, అనిల్, ప్రవీణ్, రాజేందర్, జూనియర్ అసిస్టెంట్‌లు నరేశ్, మల్లిఖార్జున్, రాహుల్ పాల్గొన్నారు.

పెద్దరామ మందిరం భూముల పరిశీలన



పెద్దరామమందిరం భూములను పరిశీలిస్తున్న అధికారులు

మోపాల్, జనవరి 20: మోపాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న పెద్ద రామమందిరం ఆలయ భూములను శనివారం దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని బాడ్సి, ముదక్‌పల్లి, మోపాల్, తదితర గ్రామాల్లో ఉన్న దేవాదాయ శాఖ భూములను పరిశీలించారు. రామమందిరం భూముల్లో పలువురు రైతులు వ్యవసాయం సాగు చేసుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు వివరించారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడున్న భూములను కొందరు రైతులు కబ్జా చేసుకొని పంటలను పండించుకుంటున్నారని అధికారులకు తెలిపారు. ఏ గ్రామంలో ఎన్ని ఎకరాల భూమి ఉందనే దానిపై ఆరా తీశారు. ఈ పరిశీలనలో దేవాదాయ శాఖ అధికారులు గంగాధర్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

ఇన్‌-చార్జీ చైర్మన్‌ను నియమించాలని మైనారిటీల రాస్తారోకో



ఆర్మూర్‌లో రాస్తారోకో చేస్తున్న మైనారిటీ నాయకులు

ఆర్మూర్‌టౌన్ , జనవరి20: పట్టణంలోని నిజాంసాగర్‌కెనాల్ క్లక్ టవర్ వద్ద మున్సిపల్ ఇన్‌చార్జీచైర్మన్ నియామించాలని శనివారం మైనారిటీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. మున్సిపల్‌లో అవిశ్వాస పరీక్ష నెగ్గి 15రోజులు అయిన ఇన్‌చార్జీచైర్మన్‌ను నియామించాలేదని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వైస్‌చైర్మన్ షేక్ మున్నాను ఇన్‌చార్జీ చైర్మన్‌గా నియామిం చాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వ్యవహారాల్లో ఎన్నికల అధికారిగా వ్యవహారించిన ఆర్డీవో వినోద్‌కుమార్ వచ్చే వరకు రాస్తారోకోను విరమించబోమని బీష్మించుకొని కూర్చున్న మైనారిటీలను ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు వచ్చి సముదాయించి రాస్తా రోకోను విరమింపజేశారు. అనంతరం మైనారిటీలు ఆర్డీవో కార్యాలయానికి వెళ్ళి ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంతియాజ్‌మొహమద్, రహమాన్, అతిక్, సుమీర్‌మొహమద్, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో ఒకరి మృతి

నవీపేట,జనవరి20: మండలంలోని సిరన్‌పల్లికి చెందిన తోట గంగాధర్(54)అనే వ్యక్తి పాముకాటుతో మృతి చెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. ఎడపల్లి మండలం జంలంకు చెందిన గంగాధర్ ఆరు మాసాల క్రితం ఉపాధి నిమిత్తం గంగాధర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సిరన్‌పల్లిలో ఉంటున్నాడని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 17న కొట్టంలో పశువులకు మేత వేస్తుండగా గంగాధర్ కాలికి పాము కాటు వేసిందని, వెంటనే అతనిని నాటు వైద్యుడి వద్ద చికిత్స చేయించనప్పటికీ నయం కాలేదన్నారు. శుక్రవారం అతనిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య లలిత, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యం ● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్ రూరల్, జనవరి 20 : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని విద్యా, వైద్యానికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం బోధన్ మండలంలోని హున్సా, ఖాజాపూర్, సాలూర, జాడి, సాలూర క్యాంప్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మెల్యేగా గెలిచిన సుదర్శన్‌రెడ్డి మొదటిసారి గ్రామాల్లో పర్యటించడంతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారని, అనంతరం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గ్రామాల్లో రాజకీయ గ్రూపు తగాదాల ఉండవద్దని, గ్రామాల అభివృద్ధి కోసం అందరూ కలిసి మెలిసి పాటుపడాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని పునరుద్ధరించి, సరిహద్దు గ్రామాల్లో చెరకు పంటల రైతులకు పూర్వ వైభవం తెస్తామన్నారు. ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. హున్సా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఉపాధ్యాయులు తమ బోధనను మరింత మెరుగుపరచాలని, పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా చూడాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థులను చేర్పించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాటశాలల్లో తమ పిల్లలను చేర్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టు షాప్‌లు పెరుగుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, బెల్టు షాప్‌లను అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలని, బెల్టు షాప్‌లను నివారించాలన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు గురి కావద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తాహెర్ బీన్ హందాన్, మండలాల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, పాషా మొహీనుద్దీన్, అల్లె రమేష్, ఖాజాపూర్ అశోక్, శీల శంకర్, సాలూర లక్ష్మణ్, వెంకట్, నాగరాజు, సురేష్ పటేల్, పోతారెడ్డి, జాడి సుందర్‌రాజు, నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



హున్సాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నేడు నవీపేటలో ఎమ్మెల్యే పర్యటన

నవీపేట,జనవరి20: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదివారం నవీపేట మండలంలో పర్యటించనున్నారని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి తెలిపారు. మండలంలోని లింగాపూర్, నాళేశ్వర్, తుంగిని, నిజాంపూర్, బినోల, ఆశాజ్యోతి కాలనీ, సిరన్‌పల్లి, జన్నేపల్లి, నాడాపూర్‌లలో జరిగేపలు అభివృద్ధి కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

'పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న టీడీపీ నగర అధ్యక్షుడు సత్యనారాయణ

సుభాష్‌నగర్, జనవరి 20:తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని నిజామాబాద్ నగర అధ్యక్షుడు అంబిక సత్యనారాయణ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీని నగరంలో ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై చర్చించారు. నగరంలోని అన్ని డివిజన్‌లలో పార్టీ నిర్మాణాన్ని చేపట్టాలని అనుబంధ విభాగాలను బలోపేతం చేసుకోవాలని అన్నారు. అందులో భాగంగా జనవరి 26న పాఠశాలలో, కళాశాలల్లో జెండా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అర్బన్ నూతన కమిటీకి పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు రఫీక్‌ఖాన్, మల్లారెడ్డి, పార్టీ కోకన్వీనర్ కోయేడి నర్సింలుగౌడ్, లవంగరాజు, నవాతే నర్సయ్య, గంగోనె రాజేశ్వర్, లక్ష్మియాదవ్, విజయ, సలీమ్, సర్వరాజ్, జాఫర్, రాజేశ్వర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామచంద్రుని ఊరేగింపు



భీమ్‌గల్‌లో పూజ చేస్తున్న అర్చకులు

భీమ్‌గల్‌రూరల్,జనవరి 20: భీమ్‌గల్ గ్రామాలయంలో శనివారం ఉద యం నుంచే శ్రీలక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో శ్రీరామ చందునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ చంద్రుని జన్మస్థలమైన అయోధ్యనగరిలో అత్యంత శోభాయమానంగా జరిగే పాణప్రతిష్ట కార్యక్రమము నిర్విఘ్నంగా మరి యు నిరాటంకంగా జరగాలని ప్రార్థిస్తూ శ్రీనిం బాద్రిస్వామి వారి భక్తబృందంచేత అఖండ రామ నామ పారాయణం, శ్రీ రామతారక మంత్ర హవనము, అఖండ అన్న దానము ఇత్యా ది కార్య క్రమాలు నిర్వహించబడ్డాయి. గ్రామాలయం నుంచి పల్లకీలో శ్రీరామ చంద్రుని ఊరేగింపు కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

ఏర్గట్ల హైస్కూల్‌కు సౌండ్ సిస్టమ్ వితరణ

ఏర్గట్ల, జనవరి 20: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1967వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, గ్రామ ప్రముఖుడు పోతు రాజారాం చేయూతనందించారు. పాఠశాలకు అవసరమయ్యే సౌండ్ సిస్టమ్‌తో పాటు ఎలక్ట్రిక్ సెట్టింగ్ బెల్‌ను సుమారు 26 వేలతో కొనుగోలు చేసి ఇచ్చారు. ఉద్యోగ రీత్యా ముంబైలో నివాసం ఉంటున్న పోతు రాజారాం తాను చదివిన పాఠశాలతో పాటు గ్రామంపైనా అభిమానంతో గతంలో కూడా అనేక సార్లు పాఠశాలకు విరాళాలు అందజేశారు. కాగా.. పాఠశాలకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసి ఇచ్చినందుకు రాజారాంను పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి అభినందించారు.

'ఆడపిల్లలను కాపాడుకొని చదివించుకుందాం'



తూంపల్లిలో పిల్లలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ పర్యవేక్షకులు ప్రియదర్శిని

సిరికొండ, జనవరి 20: ఆడపిల్లలు పుడితే భారంగా భావించకుండా వారిని కాపాడుకుని బాగా చదివించుకుందామని ఐసీడీఎస్ పర్యవేక్షకుడు ప్రియదర్శిని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ కిషోర బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని తూంపల్లి గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రియదర్శిని తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు విద్యార్థులు, తల్లిదండ్రులచే ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ప్రియదర్శిని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో- బేటీ పడావో పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. ఆడపిల్లలను కన్నా తల్లిదండ్రులు కష్టపడి ఆర్జిస్తున్న దాంట్లో నుంచి కొంత మొత్తాన్ని సుఖన్య సమృద్ధి ఖాతాలు తీసు జమాచేసుకోవాలని సూచించారు. 0-10 ఏళ్ల వయస్సు లోపు పిల్లలు ఈఖాతాలకు అర్హులని ఆమె చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక పదార్థాలను అందించడం వల్ల రక్తహీనత రాదన్నారు. రక్తహీనత నివారణకు ప్రతీ రోజు ఆకుకూరలు, తాజా పండ్లు,గుడ్లు,పాలు, పల్లీ లడ్లు,నువ్వుల లడ్డు పిల్లలకు ఆహారంగా అందించాలని ఆమె తల్లిదండ్రులను కోరారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కట్టుబడి ఉండాలన్నారు. జీవించే హక్కు,రక్షణ హక్కు,విద్యాహక్కు,ఉచిత నిర్బంధ విద్యా బాలల హక్కుల్లో భాగమన్నారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ఆడ పిల్లలకు రక్షణ కల్పిద్దాం, వారి బంగారు భవితకు పునాది వేద్దామని మాజీఎంపీపీ దీకొండ హరిత అన్నారు. శనివారం మండలంలో కొలిప్యాక్ గ్రామంలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ గర్ల్స్ చైల్డ్ ప్రొగ్రాం, బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ ఆడ పిల్లలు సమాజానికి మణిహారం లాంటి వాళ్లన్నారు. వారికి స్వేచ్ఛయుత వాతావరణం కల్పించాలన్నారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ కార్యక్రమంలో మండల అంగన్‌వాడి సూపర్‌వైజర్ రాణి, అంగన్‌వాడి టీచర్‌లు, ఆశా వర్కర్‌లు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో శనివారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందూర్ సాయన్న మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివించాలని, 18ఏళ్లు నిండిన తర్వాత వివాహం జరిపించాలని సూచించారు. అంగన్‌వాడి సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ మాట్లాడుతూ ప్రతీ ఆడ పిల్లకు సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆడ పిల్లలు మనోధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి హరిష్‌రెడ్డి, ఏఎన్‌ఎం సువర్ణ, అంగన్‌వాడి టీచర్‌లు, ఐకేపీ సీఏలు వనిత, అమల, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల అడ్మిషన్లు ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, జనవరి 20: నాగారంలోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ ఎ.సూర్యకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీతో పాటు ఈ సంవత్సరం మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు సీవోఈ గుర్తింపు వచ్చినందున ఐఐటీ, జేఈఈ, నీట్, సీఎల్ఏటీ మరియు లాసెట్ కోచింగ్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాలలో ఇంటర్‌తో పాటు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని స్పోర్ట్స్ మీట్, ఆర్మీ, డీ ఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, నేవీ వంటి ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలకు విద్యార్థులను పంపించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9849419469 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

'అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలి'

ఖిల్లా, జనవరి 20: ఫిబ్రవరి 16న జరిగే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీ యూ వ్యవసాయ కార్మిక సమావేశంలో నేతలు పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఈ సమ్మెను నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ సభలు సంయుక్తంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయని నేతలు తెలిపారు.



సీఐటీయూ సదస్సులో పాల్గొన్న నేతలు

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.135	రూ.205	రూ. 225
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.210	రూ. 230

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,100	రూ.59,100	రూ.755

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : హనుమాన్ (9.40, 1.00, 4.20, 7.40, 11.00)
స్క్రీన్-2 : హనుమాన్ (హిందీ) (12.00, 10.00)
: గుంటూరుకారం (3.20)
: హనుమాన్ (తెలుగు) (6.40)
స్క్రీన్-3 : గుంటూరుకారం (11.40, 6.20, 9.40)
: కొత్తరంగుల ప్రపంచం (2.55)
స్క్రీన్-4 : నా సామిరంగ (12.40, 6.50, 10.00)
: సైంధవ్ (3.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : నా సామిరంగ (1.35, 4.35, 10.45)
: గుంటూరుకారం (7.40)
స్క్రీన్-2 : గుంటూరుకారం (10.25, 4.20, 10.30)
: సైంధవ్ (1.30, 7.30)
స్క్రీన్-3 : హనుమాన్ (10.30, 1.30, 4.30, 7.35, 10.35)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : నా సామిరంగ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సైంధవ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్